అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శనివారం 10 జూన్ 2023

వల చుట్టుకొని మత్స్యకారుడు మృతి

నవతెలంగాణ-తలమడుగు

రుయ్యాడి గ్రామానికి చెందిన మత్స్యకారుడు కొండ్ర పొచ్చన్న(45) చేపల వల చుట్టుకొని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఎప్పటిలాగే శుక్రవారం చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్లాడు. వల వేసి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు వల చుట్టుకోవడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పేస్కేల్ కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఉద్యోగుల జాక్ ఆధ్వర్యంలో పేస్కేల్ కల్పించే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని శుక్రవారం ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జాక్ చైర్మన్ పి.రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మెన్లు సానుకూలంగా స్పందించారని, సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శామ్యూల్, రాజేందర్, పొచ్చన్న, సంతోష్, రాకేశ్, కృష్ణ, భాగ్యలక్ష్మి, వినోద్, రజిని, మాధురి పాల్గొన్నారు.



సింగరేణికి దన్నుగా..కార్మికులకు అండగా..!

- ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వని వారికి కూడా త్వరలో అందజేస్తాం
- మందమర్రిలో రూ.500కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ
- వర్ధానదిపై బ్యారేజీ నిర్మించి మూడు నియోజకవర్గాలకు సాగునీరు
- మంచిర్యాల జిల్లాకు ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు
- భారీగా హాజరైన జన సందోహం..బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, నస్పూర్, రామకృష్ణాపూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన విజయవంతమైంది. నస్పూర్ మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీగా జనం హాజరయ్యారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ సమీకృత కలెక్టరేట్ భవనంతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతానికి తలమానికంగా ఉన్న సింగరేణి సంరక్షణకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్మికులను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని ఎలాంటి ఆపద వచ్చినా అండగాఉంటామని భరోసా ఇచ్చారు. నస్పూర్ మైదానంలో ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్యక్షత నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాలను జిల్లా చేయాలని ఈ ప్రాంత ప్రజలు అనేక పోరాటాలు చేశారని తెలంగాణ వచ్చిన తర్వాత వారి కోరిక తీరిందని తెలిపారు. నూతనంగా మెడికల్ కళాశాలను ప్రారంభించామని ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికుల కోరిన కోరికలను ఒక్కొక్కటిగా సాధించుకుంటున్నామని అన్నారు. 2018లో కార్మికులకు బోనస్ శాతం 18శాతం ఉండగా తాజాగా 30శాతానికి పెరిగిందని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చాక కారుణ్య నియామకాల కింద కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. కార్మికులకు ప్రమాదం జరిగితే రూ.10లక్షలు అందజేస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు మంచిర్యాల జిల్లాకు వచ్చిన సమయంలో గోదావరి నదిని చూస్తే బాదేసిందని..ఎడారిని తలపించిందని..కానీ తెలంగాణ వచ్చిన తర్వాత చేపట్టిన పనులతో నిండుకుండలా కనిపిస్తోందని చెప్పారు. లక్ష్మీ, సరస్వతి బ్యారేజీతో పాటు ఎల్లంపల్లి పూర్తిచేసుకున్నామని చెప్పారు. బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో లక్ష ఎకరాలకు సాగునీరందించేందుకు వార్ధానదిపై బ్యారేజీ నిర్మాణం చేపడుతామని హామీనిచ్చారు. జిల్లాలో ఆదివాసీలకు పోడు పట్టాలు పంపిణీతో పాటు రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టామని, బీసీ, ఎంబీసీ కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

రూ.1658కోట్లతో చేపట్టిన చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. రూ.164కోట్లతో మంచిర్యాల- అంతర్గాం మధ్య గోదావరి నదిపై నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. రూ.530కోట్లతో మెడికల్ కళాశాల భవన నిర్మాణం ప్రారంభించారు. వీటితో పాటు పలు కొత్త పథకాలను అమలు చేస్తామని హామీలు ఇచ్చారు.

తండోపతండాలుగా తరలివచ్చిన జనం

మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో నిర్వహించిన మంచిర్యాల జిల్లా ప్రగతి నివేదిక సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. సుమారు లక్షకుపైగా జనం వచ్చారని నాయకులు అంచనా వేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సభా ప్రాంగణానికి వెళ్లేదారులన్నీ జనం, వాహనాలతో కిక్కిరిసిపోయాయి. మహిళలు, యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకు జనం ఉత్సాహంగా కనిపించారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో ఆసక్తిగా విన్నారు. జిల్లాకు సంబంధించిన వరాలు ప్రకటించిన సమయంలో ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. సభ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లువెత్తుతోంది. మంత్రులతో పాటు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు భారీగా హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.





నర్సాపూర్(జె) వాగుపై వంతెన నిర్మించాలి

- టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని నర్సాపూర్-జె గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై వంతెన నిర్మించాలని టిఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం నర్సాపూర్-జె, ఆడగూడ, భీంగూడ, జెండాగూడ, లెండిగూడ గ్రామాల ఆదివాసులతో సమావేశం నిర్వహించారు. వారు పడుతున్న బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచిన్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు అవుతున్నా ఇంకా ఆదివాసీ గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు, ఒకసారి క్షేత్ర స్థాయిలో ఆదివాసీ గ్రామాలను సందర్శించి సమస్యలు అధ్యయనం చేయాలని సూచించారు. ఐటీడీఏకు కూత వేటు దూరంలో ఉన్న గ్రామాల దుస్థితి ఇలా ఉంటే, మారుమూల ఆదివాసీ గ్రామాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఈ గ్రామాలకు బ్రిడ్జి నిర్మించి ఇస్తామని ఎంపీ, ఎమ్మెల్యే వాగ్దానాలు చేసి మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామాలకు రావడానికి రోడ్డు, బ్రిడ్జి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐటీడీఏను నాలుగు గ్రామాల ఆదివాసీలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ మండల అధ్యక్షులు కనక మల్కు, నర్సాపూర్-జె గ్రామ సర్పంచ్ ఆత్రం విషంరావ్, నాలుగు గ్రామాల పటేల్లు కిషన్, జంగు, అక్బర్ శావ్, రాము పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ అండ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేదింటి ఆడబిడ్డలు పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రూపంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని జడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ బోర్కడే హేమంత్, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం వరం లాంటిదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో పథకాల అమలు జరుగుతోందన్నారు. 9సంవత్సరాల కాలంలో దేశం గర్వించేలా రాష్ట్రం అభివృద్ధి చెందిందని పునరుద్ఘాటించారు. పేదింటి ఆడబిడ్డలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, వివిధ మండలాల జడ్పిటిసిలు అరిగెల నాగేశ్వరరావు, సంతోష్, అజయ్ కుమార్, ధృపదాబాయి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి మణెమ్మ, వివిధ మండలాల ఎంపీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



నవతెలంగాణ-బోథ్

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శుక్రవారం మండలంలోని పరిచయ గార్డెన్‌లో సంక్షేమ ఫలాలపై దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ మైనార్టీ బిసి కులాలకు సంక్షేమ పథకాలు అందించి ప్రతి ఒక్కరిని ఆదుకోవడం జరిగిందన్నారు. అలాగే రైతుబంధు, రైతు బీమా, దళితబంధు, దళితబస్తీ, కళ్యాణ లక్ష్మి లాంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరిని ఆదుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రీజ, జడ్పిటిసి సంధ్యారాణి, సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు మెట్టు కిరణ్, ఎంపిటిసిలు, సర్పంచులు, నియోజకవర్గ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

బీసీ కులసంఘాలను ఆహ్వానించకపోవడం దారుణం



నిర్మల్ : తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో సంక్షేమ ఉత్సవాలు జరుపుకున్నారని, దీనికి బీసీ కులసంఘాలను ఆహ్వానించకపోవడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఒక వైపు కుల సంఘాల కోసం ప్రభుత్వం పథకాలు ప్రవేశపెడుతున్నట్లు ప్రకటిస్తే, మరో వైపు అధికారులు కనీసం ఆ కార్యక్రమానికి కుల సంఘాల నాయకులను పిలవకపోవడం ఏంటని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కో కన్వీనర్లు కత్రోజ్ అశోక్, చారి, సిరికొండ రమేష్, చందుల ఊశన్న, జింక లక్ష్మి, నారాయణ, కొట్టురి కిషన్, కార్యనిర్వాహక అధ్యక్షులు మార్కంటి జీవన్ పాల్గొన్నారు.

వైద్య శాఖలో ఎంపికైన వారికి 12న కౌన్సెలింగ్

ఆసిఫాబాద్ రూరల్ : నేషనల్ హెల్త్ మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన ఎంఎల్‌హెచ్‌పి. పోస్టులకు గాను 1:3 జాబితాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని, జాబితాలో ఉన్నవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 12న కలెక్టరేట్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొని 1:3లో ఎంపికైన వారి జాబితా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

కేసీఆర్ సభకు బీఆర్ఎస్ నాయకులు

రామకృష్ణాపూర్ : నస్పూర్ లో జరుగనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభకు శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. పట్టణంలోని 22 కౌన్సిలర్ల ఆధ్వర్యంలో వార్డుల్లోని ప్రజలు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

జులై 29న బీమా ఉద్యోగుల డివిజనల్ మహాసభలు



నవతెలంగాణ-నిర్మల్

జులై 29న నిర్మల్ పట్టణంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కరీంనగర్ డివిజన్ స్థాయి మహాసభలు జరగనున్నాయని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకటరమణ పేర్కొన్నారు. ఈ మేరకు నిర్మల్ ఎల్ఐసి ఆఫీసులో శుక్రవారం మహాసభ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. వీర యోధుడు రాంజీ గోండ్ పోరాట పటిమకు, వెయ్యి ఉరుల మర్రికి వేలాడిన అమరుల త్యాగాలకు వేదికగా నిలిచిన నిర్మల్ గడ్డపై బీమా కార్మిక ఉద్యమ మహాసభలు జరగడం గర్వకారణమని పేర్కొన్నారు. 67 సంవత్సరాలుగా దేశ ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడిన సంస్థగా ఎల్ఐసి నిలిచిందని పేర్కొన్నారు. నేడు ప్రైవేటీకరణ విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ బీమా సంస్థలను బలహీన పరచాలని, కార్పొరేట్ వర్గాల లాభాలను పెంపు చేయాలని ప్రయత్నించడం ప్రజా వ్యతిరేకమని పేర్కొన్నారు. సంస్థను నిర్వీర్య పరచడానికి జరుగుతున్న కుట్రలను ఎదుర్కొని ప్రభుత్వ రంగంలో దృఢంగా నిలపడానికి ఉద్యోగులు చేపట్టాల్సిన ఉద్యమాల గురించి డివిజనల్ మహాసభలో చర్చిస్తారని ఆయన పేర్కొన్నారు. బీమా ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న జోనల్ నాయకులు నిర్మల్ మహాసభకు విచ్చేసి ఉద్యోగులకు మార్గ నిర్దేశం చేస్తారని తెలిపారు. నిర్మల్ పట్టణంలోని ఎల్ఐసి సంస్థ ఉద్యోగులు, అధికారులు, ఏజెంట్లతో పాటు వివిధ రంగాల కార్మిక సోదరులు ప్రజాస్వామిక శక్తులు ఈ మహాసభల విజయవంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ అధ్యక్షులు జి. రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శులు ఆర్. రాజేశం, వి. వామన్ రావు, కోశాధికారి పి. బసవేశ్వర్, నిర్మల్ బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు కల్లూరి శ్రీకాంత్, రాజేశ్వర్‌రెడ్డి, క్రిష్ణం రాజేష్, రమాదేవి, ప్రవీణ్, మారుతి, తిరుపతి పాల్గొన్నారు.

విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థ ద్వారా సేవలు మరింతగా విస్తరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థ ద్వారా ఆర్టీసీ సేవలు మరింతగా విస్తరిస్తాయని ఆదిలాబాద్ అడిషనల్ కలెక్టర్ నటరాజ్ అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో విలేజ్ బస్సు ఆఫీసర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిలాబాద్ డిపో నుండి 15 మంది, ఉట్నూర్ డిపో నుండి 8 మందిని విలేజ్ బస్ ఆఫీసర్స్‌గా నియమించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆర్టీసీ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వివరించడానికి విలేజ్ బస్సు ఆఫీసర్లు ఎంతగానో తోడ్పడతారన్నారు. ఆర్టీసీకి గ్రామాలకు ఎంతో మంచి సత్సంబంధాలున్నాయని, సేవలు విస్తరించేలా విలేజ్ బస్ ఆఫీసర్లు కృషి చేయాలన్నారు. ప్రైవేటుకు దీటుగా ఆర్టీసీ కార్యక్రమాలు చేస్తూ ఉండడం గొప్ప విషయమని తెలిపారు. ఆర్టీసీని ఆదరించేలా ప్రయాణికులను ఆర్టీసీ వైపుకు మళ్లేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం విలేజ్ బస్ ఆఫీసర్లకు కిట్లను అడిషనల్ కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.





ఆసిఫాబాద్ : ఆర్టీసీలో నూతనంగా తీసుకువచ్చిన విలేజ్ బస్సు ఆఫీసర్‌లతో ఆర్టీసీ సేవలు మరింత విస్తృతం కానున్నాయని ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. ఆర్టీసీ డిపోలో మేనేజర్ శ్రీధర్ అధ్యక్షతన విలేజ్ బస్ ఆఫీసర్లగా నియమింపబడ్డ 8మందికి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఇప్పటికే ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందిస్తుందని, దీనివల్ల మరింత క్షేత్రస్థాయికి నాణ్యమైన సేవలు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. డిపో మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలోకి ఆర్టీసీ సేవలు మరింత విస్తృతం చేసే దిశగా విలేజ్ బస్ ఆఫీసర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా నియామకమైన వారు తమ విధులను సక్రమంగా నిర్వహించి సేవలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ సరియ, ఏఎంఎఫ్ ఉదయ్, టిఐ3 భారతి, ఈడబ్ల్యుసి సభ్యుడు శ్రావణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిరమిడ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రజల సామాజిక ఆర్థిక పరిస్థితులపై పిరమిడ్ ఫౌండేషన్ వారు చేసిన పరిశీలన, ఇచ్చిన సూచనలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. నెల రోజుల నుండి జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పిరమిడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ పరిస్థితులపై చేసిన పరిశీలన పత్రాలను పరిశీలించి ఫౌండేషన్ సభ్యులతో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సామాజిక ఆర్థిక పరిస్థితులపై పిరమిడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల నుండి వచ్చిన విద్యార్థులు చేసిన సర్వే ఎంతో బాగుందన్నారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో గిరిజనుల జీవన స్థితిగతులతో పాటు వారి వెనుకబాటుకు కారణాలు తెలుస్తున్నాయని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం తీసుకునే భవిష్యత్తు కార్యాచరణలో పిరమిడ్ ఫౌండేషన్ వారిని భాగస్వాములను చేస్తామని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు అంగన్వాడీలు గ్రామ పంచాయతీల పనితీరుపై కూడా గుణాత్మకమైన పరిశీలన చేశారన్నారు. వారు చేసిన పరిశీలన ఇచ్చిన సూచనలు అభివృద్ధికి దోహదం చేసే విధంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటాం

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య



నవతెలంగాణ-ఉట్నూర్

రైతులకు కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రైతువేదికలో ఉట్నూర్ డివిజన్‌లోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల విత్తన, ఎరువుల, పురుగు మందుల డీలర్లకు ఏడిఏలు రాంకిషన్, గణేష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ డీలర్లు తమ దుకాణాల్లో స్టాక్ బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలని, రిజిస్టర్లు తప్పనిసరిగా రాయాలని, రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని పేర్కొన్నారు. రశీదులపై లాట్ నంబర్లు, గడువు తేదీ, పంట రకాలు అన్ని విధిగా నమోదు చేసి రైతుల పేర్లు సంతకాలతో పాటు అన్ని వివరాలు తప్పనిసరిగా రాయాలని తెలిపారు. రైతులకు కల్తీ విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు అమ్మితే దుకాణం లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

మండల అధికారులను కలిసిన మాలీ సంఘం నాయకులు



నవతెలంగాణ-తలమడుగు

మాలీ కులస్తుల్లో కుల పెద్ద పటేల్ మహాజనుల వ్యవస్థ గ్రామాల్లో నడుస్తోందని, అది పటిష్టంగా నడవాలంటే పోలీసు, రెవెన్యూ అధికారులు మాలీ సంఘానికి సహకరించాలని మాలి సంఘం నాయకులు ఎస్ఐ అప్పారావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే నేతృత్వంలోని మాలి సంఘం నాయకుల బృందం ఇన్చార్జి తహసీల్దార్ సంతోష్‌కు గ్రామ పెద్దల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కుల పెద్దలు చేసిన సంతకాలను పరిగణలోకి తీసుకొని కుల ధ్రువీకరణ పత్రాలు, కల్యాణలక్ష్మి పథకం వర్తింపజేయాలని కోరారు. ఆ తర్వాత ఎస్సై అప్పారావుని కలిసి శాలువాతో సత్కరించి అన్ని రంగాల్లో వెనుకబడిన మాలీల అభివృద్ధికి, ఐక్యతకు పోలీసు శాఖ పరంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, జిల్లా అధ్యక్షులు వాడగురే విజయ్, కుచులాపూర్ మహాజన్ రాగి విలాస్, లింగి మహాజన్ పటేల్ రాగి గంగారాం, భరంపూర్ మహాజన్ పటేల్ బెల్లపు వినోద్, లాల్‌గడ మహాజన్ గురునులే అమృత్ పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ అందిస్తున్న గొర్రెల పంపిణీ కార్యక్రమం ద్వారా యాదవులు ఆర్థిక పరిపుష్టి సాధించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్, జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 12 మంది లబ్ధిదారులకు గొర్రెలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో 1588 యూనిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యాదవుల ఆర్థిక స్థిరీకరణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొర్రెల పునరుత్పత్తి ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. యాదవులు ఆర్థిక అభివృద్ధి సాధించిన రోజు ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సత్యనారాయణరెడ్డి, రబ్బాని, మణెమ్మ, సురేష్‌కుమార్, జెడ్పిటిసిలు నాగేశ్వరరావు, సంతోష్, అజయ్ కుమార్, ధృపదాబాయి, వివిధ మండలాల ఎంపీపీలు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్



ఆడబిడ్డ పెండ్లి ఆర్థిక సాయం అందించి, సర్పంచ్ ఉదారతను చాటుకున్నారు. మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన నవాజ్‌ఖాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో గ్రామ సర్పంచ్ జాదవ్ సునిత నవాజ్‌ఖాన్ కుమార్తె వివాహానికి రూ.15501అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా నిరుపేదలకు తనవంతు సాయాన్ని అందిస్తున్నామని అన్నారు.

బాసర ఆలయంలో భక్తుల కోలాహలం

- అమ్మవారికి వెండి తొడుగు బహూకరణ

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి ఆలయంలో శుక్రవారం భక్తుల కోలాహలం నెలకొంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనానికి భక్తులకు గంటకు పైగా సమయం పట్టడంతో క్యూలైన్‌లో చిన్నారులు వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భక్తులు చిన్నారులకు ఆలయ అక్షరభ్యాస మండపాలలో పూజలు జరిపించి, మొక్కులు చెల్లించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన కృష్ణకుమార్ భక్తుడు రూ. లక్ష 15 వేల విలువగల వెండి మకర తోరణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారికి, ఆలయ ఇన్స్‌పెక్టర్ సమక్షంలో అందజేశారు. వీరికి ఆలయం తరపున తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జీ సర్దార్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో ఇక్కడి అసమర్థ పాలకుల వల్ల నిర్లక్ష్యానికి గురైె ముధోల్ నియోజకవర్గం నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ ఏర్పడి పదేళ్ల కాలం అవుతున్న నేటికీ ముధోల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలేని స్థానిక ఎమ్మెల్యే ఎందుకని ప్రశ్నించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే అసమర్థ విధానాల వల్లే ఇక్కడి ప్రాంతం నేటికీ కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆరోపించారు. చారిత్రక రాజకీయ నేపథ్యం కలిగిన ముధోల్‌ను నిర్లక్ష్యం చేసింది, ఇక్కడి పాలకులేనని అన్నారు. రెండు కుటుంబాల చేతిలో బందిగా ఉన్న ముధోల్‌ను రక్షించుకోవాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. అవినీతి, కుటుంబ పాలనను అంతం చేసి ముధోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందమనీ అన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి

నవతెలంగాణ-సారంగాపూర్



ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందని సంఘటన శుక్రవారం మండలంలోని బోరిగాం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన షేక్‌బాబు(60) శుక్రవారం ఉదయం కాలకృత్యాల కోసం గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారీ చెరువులో పడిపోయినట్లు మృతుని బార్య షేక్ హలీమా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణా సాగర్ రెడ్డి తెలిపారు. మృతుడికి బార్య హలీమా, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

బేలలోనే పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలి

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోనే డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని కొనసాగించి, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా బేల మండల కేంద్రంలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని ఎలాంటి సమాచారం లేకుండా జిల్లా కేంద్రానికి తరలించడం వల్ల 600 మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇప్పటికే తరోడా వంతెన కుంగిపోవడం వల్ల రాకపోకలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయని అన్నారు. ఇలాంటి సమయంలో పరీక్షా కేంద్రం మార్చడం వల్ల విద్యార్థులు దాదాపు 50 కిలోమీటర్లు ప్రయాణించి ఎలా పరీక్ష రాస్తారని అన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులను, కాకతీయ యూనివర్సిటీ అధికారులను కలిసి సమస్యని విన్నవించామని, కానీ వారి నుండి ఎలాంటి స్పందన లేదని అన్నారు. ఇకనైనా జోగు రామన్న గతంలో ఇచ్చిన హామీ మేరకు పరీక్షా సెంటర్ నీ కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మాడావార్ హరీష్, అశోక్, రాము, సబ్దార్, కాంత, శివకిరణ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జీగా ఎండీ హసీబ్



నవతెలంగాణ-కడెం

బీఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జీగా ఎండీ హసీబ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ నియమించారు. ఈ సందర్భంగా హసీబ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

12న తెలంగాణ రన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకలలో భాగంగా పోలీసు, యువజన, క్రీడల శాఖ ఆద్వర్యంలో ఈ నెల 12న తెలంగాణ రన్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి ఉదయం 6.00 గంటలకు తెలంగాణ రన్ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు, యువకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ శిక్షణ అభ్యర్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువజన, క్రీడా సంఘాలు, సభ్యులు, మెడికోలు, ప్రజలు, వాకర్స్, సీనియర్ సిటిజెన్లు, పోలీసు, ఎక్సైజ్, ఫైర్, ఇతర శాఖల ఉద్యోగులు, మాజీ సైనికులు ఈ తెలంగాణ రన్‌లో పాల్గొని, విజయవంతం చేయాలని అన్నారు. తెలంగాణ రన్ కార్యక్రమానికి సంబంధిత శాఖ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలో నెలవారి మరమ్మత్తు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు లక్ష్మణచాంద, చామన్‌పల్లి, తీర్యేల్లి, పొట్టపెల్లి పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మహేష్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కొరకు ఈనెల 10వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఏఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భుక్తపూర్ సబ్ స్టేషన్ పరిధిలో భుక్తాపూర్, సినిమా రోడ్, మోచిగల్లీ, ద్వారకా నగర్, విద్యానగర్ ఏరియాలలో 10వ తేదీన ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 01: 00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్‌రూరల్ : నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ మండలంలోని బంగారిగూడ, పిప్పల్దరి, అంకోలి సబ్ స్టేషన్ పరిధిలో నెలవారి మరమ్మతుల కారణంగా ఉ: 10:00 గంటల నుంచి మ: 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ తిరుపతిరెడ్డి తెలిపారు. పైసబ్ స్టేషన్ల పరిదిలోని వినియోగదారులందరు సహకరించగలరని తెలిపారు.

కేసీఆర్ పాలనలో కులవృత్తులకు పూర్వ వైభవం

- బడుగులకు బాసటగా రూ.లక్ష ఆర్థిక సాయం • మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కుల వృత్తులకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తున్నారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంక్షేమ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు అందుతున్నాయని అన్నారు. సంక్షేమ ఫలాలు పొందని ఇల్లు లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. రైతులకు రైతుబంధు, రైతుభీమా, రైతు భరోసా వంటి పథకాల రూపంలో ఆర్థిక సాయం అందజేస్తోందని వివరించారు. అలాగే దళితులకు దళితబంధు అందజేస్తోందన్నారు. 2014కు ముందు అచేతనంగా మారిన కుల వృత్తులకు జీవం పోసింది సీఎం కేసీఆర్ నే అన్నారు. కుల వృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే నేటి నుంచి కులవృత్తుల కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని సీఎం కేసీఆర్ ఇవాళ ప్రారంభిస్తున్నారని తెలిపారు. వెనుకబడిన సామాజికవర్గాల్లోని చేతి వృత్తులు, కులవృత్తులు నిర్వహించే మేదరి, కమ్మరి, రజక, నాయి బ్రాహ్మణ, విశ్వ బ్రాహ్మణుల అభ్యున్నతికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. గత ప్రభుత్వాలు కంటి తుడుపుగా ఇచ్చిన రెండువందల రూపాయల పింఛన్‌ను ఆసరా కింద రూ. 2,016, దివ్యాంగులకు రూ. 3,016 పెంచడం ప్రజల కష్టాలెరిగిన ప్రజా పాలకుడు కేసీఆర్‌కే సాధ్యమని అన్నారు. బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, ఫైలేరియా బాధితులకు, డయాలసిస్ రోగులకు సైతం రూ. 2,016 పింఛన్ ప్రతి నెలా ఠంచన్‌గా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణయేనని స్పష్టం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతు బీమా అమలు చేస్తున్నామని అన్నారు. చేపల పంపిణీ, గొర్రెల పంపిణీ వంటి పథకాలతో చేతి వృత్తులకు, కుల వృత్తులకు భరోసా కల్పిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, జెడ్పీ చైర్మెన్ కోరిపెల్లి విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ కోరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ డా.సుభాష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీచైర్మెన్ రాథోడ్ జనార్ధన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం వినూత్న పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తోందని జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. శుక్రవారం స్థానిక రత్నా గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సంక్షేమ సంబురాలు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్, ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ గీతం ఆలపించారు. అనంతరం జెడ్పీ చైర్మెన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు గొల్ల కుర్మల లబ్ధిదారులకు రెండో విడత గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, మైనారిటీ, గ్రామీణాభివృద్ధి సంక్షేమ శాఖల అధికారులు జిల్లాలో తమ శాఖల ద్వారా జరిగిన సంక్షేమ, అభివృద్ధి ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించారు. జిల్లాలో సంక్షేమ శాఖల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించిన పలువురు లబ్ధిదారులు వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఆసరా ఫించన్, రైతుబంధు, దళితబంధు లాంటి వినూత్న సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని అన్నారు. రూ.200 ఉన్న ఆసరా పింఛన్‌ను రాష్ట్రం ఏర్పడిన తరువాత రూ.2016 రూపాయలు, దివ్యంగులకు రూ. 3016 లకు పెంచడం జరిగిందన్నారు. సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకల సందర్భంగా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో సంక్షేమ వసతి గృహాలను పెంచడం జరిగిందని అన్నారు. మన ఊరు- మన బడి కింద పాఠశాలకు ఆధునీకరణ, మరమ్మతులు నిర్వహించి, కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం జరుగుతుందని అన్నారు. చేతివృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం లాంఛనంగా రాష్ట్ర ముఖ్య మంత్రి చేతుల మీదుగా నేడు ప్రారంభం కానున్నదని తెలిపారు. గిరిజనులకు త్వరలో పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతు బంధు, రైతు బీమా, వైద్య శాఖ ద్వారా ఆరోగ్య మహిళా, కెసిఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, స్త్రీ శిశ సంక్షేమ శాఖ ద్వారా ఆరోగ్య లక్ష్మి, బిసి సంక్షేమ శాఖ ద్వారా గొర్రెల పంపిణీ, లక్ష రూపాయల ఆర్థిక సాయం, ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా దళితబంధు, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పోడుభూములకు పట్టాలు, ఇలా అన్ని శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు చేరేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 8వ రోజు సంక్షేమ సంబరాలు కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామని అన్నారు. ఎందరో ఉద్యమకారుల పోరాటం, అమరవీరుల ప్రాణ త్యాగాలతో వలన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. వారి ఆశయాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం తొమ్మిది సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మన ఊరు - మన బడి కింద పాఠశాలను ఆధునీకరించి, మౌలిక సదుపాయాల కల్పించడం జరిగిందన్నారు. గొల్ల కుర్మలకు ఈ రోజు రెండవ విడత గొర్రెలను పంపిణీ ప్రారంభించడం జరిగిందని, చేతికుల వతుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించనుందని, ఈ నెల 20 వరకు అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం పలువురు లబ్దిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కులను, ఆసరా ఫించన్ లబ్దిదారులకు కార్డులను కలెక్టర్, ఎమ్మెల్యేలు అందజేశారు. సంక్షేమ శాఖలలో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు సిబ్బందికి శాలువా, ప్రశంస పాత్రలతో సత్కరించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఆటపాటల ప్రదర్శనలు ఆహ్వానితులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో డీసీసీబీ, గ్రంథాలయ, మున్సిపల్ చైర్మెన్లు అడ్డి భోజరెడ్డి, రౌత్ మనోహర్, జోగు ప్రేమేందర్, రైతు, వివిధ కుల సంఘాల నాయకులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు రాజలింగం, సునీత కుమారి, కృష్ణవేణి, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్దిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

సంబరాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే ఎదుటే నిరసన

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సంక్షేమ దినోత్సవ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్నల ఎదుట ని కులవృత్తుల సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని రత్న గార్డెన్ లో దశాబ్ది ఉత్సవాల సంబరాల్లో నాయి బ్రాహ్మణులు ఆందోళన చేపట్టారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మెన్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య అప్పటి వరకు సాఫీగా కొనసాగుతున్న కార్యక్రమం మధ్యలో ఒక్కసారిగా నాయి బ్రాహ్మణులు వచ్చి ప్లకార్డులు పట్టుకుని సభ ముందు బైఠాయించి నిరసన నినాదాలు చేశారు. కార్పొరేట్ సెలున్లను రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం ఎమ్మెల్యే జోగు రామన్న వారి సమస్యను విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



బీర్సా ముండా పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రాంతివీర్ భగవాన్ బిర్సాముండా 123వ వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి శుక్రవారం బిర్సాముండా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిర్సాముండా పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని తమ హక్కుల కోసం పోరాటం చేయాలని అన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు విజయ్ గన్నోజి, తాటి సతీష్, రాము గేడం, సబ్దర్, ముఖీం, కాంత, శివకిరణ్ ఉన్నారు.





కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

ఆదివాసులను ఐక్యం చేసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు భగవాన్ బిర్సా ముండా అని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. శుక్రవారం బిర్సా ముండా వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసులు ఆయన అడుగు జాడల్లో పయనిస్తు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నగేష్, ఆనంద్, మధుకర్, పాల్గొన్నారు.

వడ్ల బస్తాలు తరలిస్తున్న లారీ దగ్ధం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

వడ్ల బస్తాలు లోడ్ చేసుకొని గోదాంకు తరలిస్తున్న లారీ దగ్ధమైన ఘటన శుక్రవారం సిర్గాపూర్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సారంగాపూర్ మండలం కౌట్ల గ్రామం నుండి ఐకేపీ ఆధ్వర్యంలో తూకం వేసిన వడ్ల బస్తాలను శుక్రవారం (టీఎస్ 01 యూపి1575) నెంబరు గల లారీలో లోడ్ చేసుకొని బయలుదేరారు. మార్గ మధ్యంలో దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ గ్రామం వద్ద లారీ బ్యాటరీ నుండి పొగ వస్తుందని గమనించిన డ్రైవర్, క్లీనర్ చెరువు పక్కన లారీని నిలిపి బ్యాటరీపై నీరు పోసేందుకు చెరువులోకి వెళ్లారు. వెంటనే బ్యాటరీ నుండి మంటలు చెలరేగి లారీలోని వడ్ల బస్తాలకు నిప్పు అంటుకుంది. లారీ ముందు భాగం నుండి హఠాత్తుగా మంటలు ఉవ్వెత్తున చెలరేగడంతో స్థానికులు ఖంగు తిన్నారు. లారీ ఇంజన్ భాగం పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు వెంటనే పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. ఎంఆర్ఓ కరీం, ఆర్ఐ సంతోష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సవారి బంగ్లా ప్రారంభం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామంలో అదనపు కొత్తగా నిర్మించిన సవారి బంగ్లాను శుక్రవారం విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు ఐక్యం రుయ్యాడి గ్రామమని అన్నారు. ప్రతి యేట మొహరం పండుగకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకుంటారని అన్నారు. కుల మతాలకు అతీతంగా గ్రామస్తులందరం ఐక్యంగా ఆనందోత్సవల మధ్య మొహర్రం పండుగను నిర్వహించుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధర్‌రెడ్డి, సర్పంచ్ పోతారెడ్డి, గ్రామస్తులు గంగాధర్, ప్రకాశ్‌రెడ్డి, గంగాధర్, దివాకర్, మోతే శ్రీనివాస్, గణపతి, గంగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

- ప్రధానోపాధ్యాయులు కె.జైవంత్‌రావ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

బడీడు పిల్లలందరిని పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల పోతగూడ ప్రధానోపాధ్యాయులు కే.జైవంత్‌రావ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పోతగూడ, ఖండాల, చిచ్‌ధరి, ఖానాపూర్, లోహర, హత్తిగుట్ట, చింతగూడ, ధార్‌లోద్ది(కె) గ్రామాలలో ప్రొ। జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీని నిర్వహించి అవగాహన కల్పించారు. చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కే.జైవంత్‌రావ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, నాణ్యమైన పోషకాలు కలిగిన మధ్యాహ్న భోజనంతో పాటు సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే బోధన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.గజానంద్, వార్డెన్ జె.దత్తా, ఎఎన్ఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చేప మందు ప్రసాదం పంపిణీ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని బీరవెల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల అవారణలో గురువారం మృగశిరకార్తెను పురష్కరించుకుని సగ్గం కృష్ణ సోదరులు ఉబ్బస వ్యాధిగ్రస్తులకు ఉచిత చేప ప్రసాదం(మందు) పంపిణీ చేశారు. ఉదయం నుండి నిర్మల్ జిల్లాతో పాటు వివిధ జిల్లాలనుండి రెండు వేల మంది వ్యాధిగ్రస్తులు తరలివచ్చి చేప ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా చేప మందు కోసం వచ్చిన వారికి గ్రామ అభివద్ధి కమిటీ అధ్వర్యంలో తాగునీరు, టెంటు కుర్చీలు ఏర్పాటు చేయగా స్థానిక ఎస్సై కృష్ణా సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవీంద్రనాథ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహినొద్దిన్, కరోబారి రాజేశ్వర్‌లు వీడీసీ సభ్యులు భూమరెడ్డిలు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
శనివారం 10 జూన్ 2023

గొర్రెల పంపిణీ



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

చింతగూడ గ్రామంలో శుక్రవారం యాదవులకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా సబ్సిడీపై గొర్రెల పంపిణీ చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, సర్పంచి ఆత్రం సంజీవ్, మండల కోఆప్షన్ సభ్యుడు మహెబూబ్‌ఖాన్, పశువైద్యాధికారి విజయ్, అసిస్టెంట్లు రాజ్‌కుమార్, శైలేందర్, ఆనంద్‌రావు, గోపాల మిత్రలు జమీర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మంచిర్యాల పర్యటన సందర్భంగా శుక్రవారం ఉదయం వివిధ పార్టీలకు చెందిన నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మండలానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్, ఏమ్మార్పిస్ నాయకులను శుక్రవారం తెల్లవారుజామున జైపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, విశ్వంబర్‌రెడ్డి, డేగ నగేష్, మహమ్మద్ ఫాయాజుద్దిన్, చిప్పకుర్తి లింగన్న ఉన్నారు. సీపీఐ(ఎం) నాయకులను చెన్నూర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, చెన్నూర్ పట్టణ కార్యదర్శి ఎండీ ఆవేజ్, కోటపల్లి మండల కార్యదర్శి కావేరి రవి, నాయకులు మారయ్య ఉన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-సిర్పూర్(టి)

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కళ్యాణలక్ష్మి చెక్కులను మండల ప్రత్యేక అధికారిణి తారామణి, సర్పంచ్ తాఫీమ పర్వీన అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రియాజ్ అలీ మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి పథకంలో 1241 మంది దరఖాస్తు చేసుకోగా 1174 మంది లబ్ధి పొందగా, 27 దరఖాస్తులను తిరస్కరించినట్టు తెలిపారు. మండలం ప్రత్యేక అధికారిణి తారామణి మాట్లాడుతూ పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఇబ్బంది కల్గకుండా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, రాబోవు కాలంలో మరికొంత మంది లబ్ధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుడికిలి పిప్రే ప్రభాకర్, ఎంపీటీసీ తుకారాం సిర్పూర్ ఉప సర్పంచ్ తోట మహేష్, మండల కోఆప్షన్ సభ్యులు కిజార్ హుసేన్, వార్డ్ సభ్యులు ఇఫ్ఫుత్ హుస్సేన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- జిల్లా విద్యాధికారి అశోక్



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని జిల్లా విద్యాధికారి పర్ష అశోక్ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీడిచేను గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో జాయిన్ చేశారు. అనంతరం గ్రామంలోని తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, నాణ్యమైన పోషకాలు కలిగిన మధ్యాహ్న భోజనంతో పాటు సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధ్యాలతో బోధన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెస్రం ఉమ, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్, మండల విద్యాధికారి గడ్డం భిక్షపతి, ఎంపీటీసీ తిరుపతి, జిల్లా పరీక్షల పరిశీలకులు ఉదయ్‌బాబు, భట్టుపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తూడురి నాగేశ్వర్‌రావు, జీడిచేను ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పుల్లూరి బాలకృష్ణ, సీఆర్పీ అర్జున్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గనుల పొడిగింపు పనులు త్వరగా పూర్తి చేయాలని డైరెక్టర్ల ఆదేశాలు



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సంస్థ డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి మోహన్‌రెడ్డి ఇతర ఏరియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మందమర్రి ఏరియాకు చెందిన కాసిపేట 1ఏ, కెకె ఓసీపీ, ఆర్కేపి ఓసీపీ గనుల పొడిగింపు విషయమై చర్చించారు. గనుల పొడిగింపు కోసం జరుగుతున్న పనుల గురించి తెలుసుకుని దీనికి సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీఎం మోహన్‌రెడ్డిని సంస్థ డైరెక్టర్లు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, శాంతిఖని గ్రూప్ ఏజెంట్ విజయ్‌కుమార్, సివిల్ ఈఈ జయప్రకాష్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను శుక్రవారం ఏడీఏ మనోహర్, ఏఓ రామకృష్ణ తనిఖీ చేశారు. పలు విత్తనాల కంపెనీ నమూనాలను(ప్యాకెట్లను) సేకరించి మొలక శాతం తెలుసుకోవడాని సీడ్ టెస్టింగ్ ల్యాబ్ హైదరాబాద్‌కు పంపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని తెలిపారు. ఎవరైన డీలర్లు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే ఏఓ రామకృష్ణను సంప్రదించాలని తెలిపారు. డీలర్లు ఎవరైన విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలు అమ్మే సమయం, ప్రతి డీలర్ వద్ద పీసీ, ఇంవాయిస్ తప్పకుండా ఉంచుకోవాలని సూచించారు. రైతులు గ్లైసిల్ విత్తనాలు వేసి మోసపోవద్దని, విత్తనాలు అమ్మేటప్పుడు రశీదు తప్పకుండా రైతుకు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 11న నిర్వహించే గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గ్రూప్-1 పరీక్షకు సంబంధించి అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలను అన్ని విధాల సిద్ధం చేయాలన్నారు. కేంద్రాల్లో అవసరమైన తాగునీటి వసతి కల్పించాలని, విద్యుత్ సౌకర్యంతో పాటు అవసరమైన ఇతర అన్ని రకాల వసతులు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 10 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10.30గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, 1గంటకు పూర్తవుతుందని తెలిపారు. అభ్యర్థులను 8గంటల నుండి సెంటర్ లోపలికి పంపించాలని సూచించారు. సెంటర్‌లో సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ముందస్తుగా అభ్యర్థులు చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష నిర్వహించే సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, ఆయా సెంటర్ల చీఫ్ సూపరిండెంట్‌లు పాల్గొన్నారు.





సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

త్వరలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి కలెక్టరేట్ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఖరారు అయ్యేలోపు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



నవతెలంగాణ -వేమనపల్లి

మండలంలోని ముల్కలపేట గ్రామంలో గురువారం తుమ్మిడే లచ్చయ్యకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఇంటిని ఆనుకొని ఉన్న షెడ్డులో వేడి నీళ్ల కోసం కట్టెల పొయ్యి నుండి షెడ్డుపై ఉండే కవర్‌కు మంటలు అంటుకున్నాయి. నిమిషాల వ్యవధిలో మంటలు చెలరేగి ఇల్లంతా వ్యాపించాయి. అదే సమయంలో ఒక్కసారిగా గ్యాస్ బండ పేలి మంటలు ఎక్కువగా వ్యాప్తి చెందాయి. అందరూ చూస్తుండగానే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. గ్రామ ప్రజలు అప్రమత్తమై మోటార్ల ద్వారా నీరు పట్టి మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మిగతా మంటలు ఆర్పేశారు. ఇంట్లో సుమారు రూ.3లక్షల నగదు, 10తులాల బంగారు ఆభరణాలు, 15తులాల వెండి, రూ.3లక్షలు విలువ చేసే ఇంటి సామాగ్రి పూర్తిగా కాలిపోయింది. యువకులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఫైరింజన్ వచ్చేసరికి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. మొత్తంగా సుమారు రూ.10లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా తమని ఆదుకోవాలని కోరారు. ప్రమాద ఘటన స్థలాన్ని ఆర్ఐ లక్ష్మణ్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. నీల్వాయి ఎంపిటిసి ఆర్.సంతోష్ కుమార్ కాలిన ఇంటిని పరిశీలించి బాధితుడిని పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కోలి వేణుమాధవ్‌రావు, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల లింగాగౌడ్, సర్పంచ్ బెడ్డల రాజలింగు సైతం బాధితుడిని పరామర్శించారు.

17న అంగన్‌వాడీల బహిరంగసభను విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జీపు జాతా ప్రారంభాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న ఆసిఫాబాద్‌లో బహిరంగసభ నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో నిర్వహించిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీతో పాటు విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు వనిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని తదితర డిమాండ్‌లతో రాష్ట్ర జీపు జాతాను 17న ఆసిఫాబాద్ నుండి ప్రారంభించనున్నట్లు తెలిపారు. జులై పదిన అంగన్‌వాడీ ఆలిండియా డిమాండ్స్ డేగా పరిగణించి 10కె వాక్ ను బ్లాక్ యునిఫాంతో నిర్వహించి, కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. యూనియన్ రాష్ట్ర నాయకురాలు ఆర్ త్రివేణి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్ల గడిచినా ఇప్పటి వరకు అంగన్‌వాడీలకు సంబంధించి ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని భావించి ఆలిండియా యూనియన్ దేశవ్యాప్త పోరాటాలకు పిలుపునిచ్చిందని, ఇందులో భాగంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెళిశాల కృష్ణమాచారి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి వై అరుణ, నాయకులు కృష్ణవేణి, రజిత, జయ మండల్, మల్లీశ్వరి, రూప, ఉమాదేవి పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు గౌడ్‌ల ధర్నా



నవతెలంగాణ-రెబ్బెన

బీసీ కులవృత్తుల మాదిరి లక్ష రూపాయల ఆర్థిక సాయం గౌడ గీత కార్మికులకు కూడా అందించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులుగౌడ్ మాట్లాడారు. పొట్ట కూటి కోసం ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ఆకాశమంత తాటి, ఈత చెట్లు ఎక్కే గౌడ గీత కార్మికులకు బిసి కుల వృత్తుల మాదిరి లక్ష రూపాయల ఆర్థిక సహాయ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కెసిఆర్ మొదటి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ఊరురా, వాడవాడల బెల్ట్ షాపులు ఏర్పడడంతో కల్లు నిరాధారణకు గురై గౌడ్‌లు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు అందించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం. బైక్, ఏజెన్సీ గీతకార్మికుల లైసెన్సుల పునరుద్ధరణ, బ్రాందీ షాపుల్లో 50శాతం వాటా అందించాలని డిమాండ్ చేశారు. 12న సోమవారం గ్రీవెన్స్ డే రోజున కలెక్టరేట్‌ల ముందు ధర్నాలు చేపట్టి కలెక్టర్‌లకు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు మోడం చిరంజీవిగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రంగు శ్రీనివాస్‌గౌడ్, యువత జిల్లా అధ్యక్షులు దేవరకొండ సంతోష్‌గౌడ్, సంఘం మండల అధ్యక్షులు తాళ్లపల్లి కిష్టాగౌడ్, మండల ఉపాధ్యక్షులు మామిడి సతీష్‌గౌడ్, నాయకులు ఆకుల సురేష్‌గౌడ్, కొయ్యడ సత్యనారాయణగౌడ్, మోడం వెంకటేశ్వర్‌గౌడ్, మల్లాగౌడ్ పాల్గొన్నారు.

విధుల నుండి తొలగించిన ముగ్గురికి తిరిగి నియామక ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత ఏడాది సెప్టెంబర్ నెలలో కాగజ్‌నగర్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థిని మృతికి కారణమంటూ విధుల నుండి తొలగించబడ్డ ముగ్గురిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సమగ్ర శిక్ష శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పట్లో విద్యార్థిని మృతికి కారణమని భావించి కాగజ్‌నగర్ కేజీబీవి స్పెషల్ అధికారి పి స్వప్న, డ్యూటీ టీచర్ జి. శ్రీలత, ఎఎన్ఎం సిహెచ్ భారతిలను విధుల నుండి తొలగించారు. ఇందులో పి స్వప్నను తిర్యాణి మండలం మాణిక్యాపూర్ కేజీబీవికి స్పెషల్ అధికారిగా, జి శ్రీలతను చింతలమానెపల్లి కేజీబీవీకి సీఆర్టీగా, సిహెచ్ భారతిని సిర్పూరు (టి) కేజీబీవీకి ఎఎన్ఎంగా కాంట్రాక్టు పద్ధతిపై నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల జారీకి కృషి చేసిన పీఆర్టీయుటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగలి జైపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, శాసనమండలి సభ్యులు కూర రఘోత్తంరెడ్డికి ఆ సంఘం జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ, వెట్టిచాకిరి చేయించుకుంటోందని గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకుడు పి.రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా దశల వారి పోరాటాలలో భాగంగా సిర్పూర్ మేజర్ గ్రామపంచాయతీ ఈవో కృష్ణమూర్తికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సఫాయి కార్మికులు, ఎలక్ట్రిషన్, వాటర్‌మెన్, డ్రైవర్స్ ఇతర సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా అవసర ప్రాతిపదికన పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, జీవో నెంబర్ 51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి యస్.గణేష్, కోశాధికారి యు.భార్గవ్, ఉపాధ్యక్షులు యస్.మారుతీ, రాజమల్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని సిఈఆర్ క్లబ్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలను బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు క్రమశిక్షణతో ఈ పోటీలో పాల్గొనాలని సూచించారు. చెస్ ఆటలతో మెదడుకు మేత అని అన్నారు. విద్యార్థులు, యువకులు ఈ పోటీలలో పట్టుదలతో ఆడాలని తెలిపారు. పోటీలకు సింగరేణి యాజమాన్యం అన్ని విధాల సహకారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరాజ్ రెహమాన్, ఉమ్మడి జిల్లా చెస్ చైర్మన్ కనకయ్య, ఇంచార్జ్ ఎస్ఓటు జీఎం విజయ్‌కుమార్‌సింగ్, ఏరియా ఎస్ఆర్‌పిఓ కిరణ్‌కుమార్, ఎస్సై ఎల్ భూమేష్, చెస్ అధ్యక్షులు కోట సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు భోగి ఉపేందర్, గోపికృష్ణ, గ్రామ సర్పంచ్ సుమలత శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం అరికట్టాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ-జైపూర్

సింగరేణిలో రాజకీయ జోక్యం అరికట్టాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఇందారం 1ఏ గని పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 11వ వేజ్ బోర్డు 19 శాతం మినిమం గ్యారెంటీ బెన్ఫిట్ సాధించడం బొగ్గు గని కార్మికుల ఘన విజయమని పేర్కొన్నారు. అన్ని అలవెన్సులపై 25 శాతం పెంచుకోవడం జరిగిందని తెలిపారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 11న తలపెట్టిన చలో కొత్తగూడం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వీరభద్రయ్య, నాగభూషణం, ఇక్బాల్ హుసేన్, సత్తయ్య, రాజయ్య, వెంకటేశ్, కుమారస్వామి, రమేష్ పాల్గొన్నారు.

పద్మశాలీలకు రూ.లక్ష సాయం అందించాలి



నవతెలంగాణ-రెబ్బెన

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న పద్మశాలీ కుటుంబాల జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం చేతివృత్తుల జాబితాలో పద్మశాలి కులాన్ని చేర్చి చేయూతనందించాలని పద్మశాలి సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం తహసీల్దార్ మల్లికార్జున్‌కు పద్మశాలి సమస్యలపై వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు మారిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీ వర్గాల్లో అత్యంత వెనుకబడిన పద్మశాలి కులాన్ని రుణ సాయం పథకంలో చేర్చకుండా అన్యాయం చేశారన్నారు. చేనేత కార్మికులకు చేయూతనందించేందుకు వెంటనే చేనేతబంధు పథకాన్ని అమలు చేయాలన్నారు. చేనేత మగ్గాలు అంతరించిపోయి పవర్ లూమ్స్ యంత్రాలు రావడంతో పద్మశాలీలు దుకాణాల్లో పని చేస్తూ దీనస్థితిలో ఉన్నారని తెలిపారు. వారిని ఆదుకునేందుకు వెంటనే ప్రభుత్వం రుణ సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు గుండేటి వీరస్వామి, దోమల పోచయ్య, పొన్న శంకర్, హనుమండ్ల సత్యనారాయణ, చందర్, వనమాల భీమయ్య, సామల శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
శనివారం 10 జూన్ 2023

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-బోథ్



మండలంలోని గొర్రెల తండ గ్రామానికి చెందిన మల్లారి సింగ్ అనే వ్యక్తి రెండు కిడ్నీల వ్యాధితో బాధపడుతున్నాడు. శుక్రవారం తుల శ్రీనివాస్ సొసైటీ చైర్మెన్ ఎంపీపీ తుల శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఇంటికి పెద్ద దిక్కైన తండ్రి రెండు కిడ్నీలతో బాధపడుతున్న కుటుంబానికి తన వంతు రూ.70 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే ఆయనకు కనీసం ఉండటానికి గూడు లేకపోవడంతో తను గూడు నిర్మాణం కొరకు విరాళాన్ని సేకరించి నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని లింగి వృద్ధాశ్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి, తన జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జీ రత్నపురం రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, బూత్ అసెంబ్లీ ఇన్‌చార్జీ మిషన్ జంగుబాబు, జిల్లా కార్యదర్శి మీర్జా హరీష్, బోథ్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు సృజన్ పాటిల్, పెంటపర్తి ఆశన్న, గణేష్, మీనా నాయకులు పాల్గొన్నారు.



ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు జాదవ్ అశోక్ కుమార్ ఎస్టీయూ పతాకావిష్కరణ గావించారు. అనంతరం సంఘానికి సేవలందిస్తున్న క్రియాశీల కార్యకర్తలను సన్మానించారు. అనంతరం జాదవ్ అశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 76 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై నిరంతరంగా పోరాడుతూ, విద్యారంగంలో ఉపాధ్యాయుల సంక్షేమానికై హక్కుల సాధనలో విజయపథంలో ముందుందని అన్నారు. ఎందరో సంఘ నాయకుల త్యాగ ఫలంగా మగ్దూం మొయినుద్దీన్ ఆశయాలను సాధించిందని, రాష్ట్రంలో సంఘం ఎల్లవేళలా ఉద్యమబాటలో పయనించిందని అన్నారు. రాజీలేని పోరాటమే ఊపిరిగా నిలబడ్డ సంఘం ఎస్టీయూ అని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కూడా కీలకపాత్ర పోషించిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మూగ శ్రీనివాస్ మాట్లాడుతూ జూలై 1 నుంచి కొత్త పీఆర్సీని అమలు చేయాలని, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని అన్నారు. బదిలీలు, పదోన్నతులను చేపట్టుటకు తగు చర్యలు తీసుకోవాలని, సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని అన్నారు. డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేజీబీవీ బదిలీల్లో లాంగ్ స్టాండింగ్‌ను పరిగణలోనికి తీసుకొని అన్ని ఖాళీలు చూపించాలని అన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో స్కావెంజర్లను, విద్యా వాలంటీర్లను నియమించాలని, గిరిజన సంక్షేమ శాఖలో ఉన్నతీకరించబడిన పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పుప్పాల నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దిలేష్ చౌహన్, బెజ్జంకి రవీంద్ర, రాష్ట్ర కార్యదర్శి నూటంకి సత్యనారాయణ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జాదవ్ రవికుమార్, చంద్రశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి మనోహర్, జిల్లా నాయకులు శీతల్ చౌహన్, శివప్రసాద్, ఆత్మారాం, అశోక్, మల్లేష్ ప్రేమ్‌దాస్, వామన్ రావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతో పాటు ఉపకారవేతనం



నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వ కళాశాలలు, ప్రయివేటు కళాశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యనందిస్తు ప్రభుత్వం ఉప కారవేతనం అందిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్ ఇన్‌చార్జి బాలాజీ కాంబ్లే అన్నారు. శుక్రవారం ఖంపూర్, మాదాపూర్, గ్రామంలో పదో తరగతి పాసైన విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. పూర్వ విద్యార్థులతో కలిసి విద్యార్థులు పోషకులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందటకు తగు సూచనలు చేశారు. ప్రభుత్వ కళాశాలలో ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా ప్రవేశాలు పొందవచ్చనీ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్ కూడా అందిస్తుందనీ పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవం గల అధ్యాపకులతో నాణ్యమైన విద్య బోధన బోధిస్తారన్నారు. అందుకని విద్యార్థులు పోషకులు ఆలోచించి ప్రయివేటు యాజమాన్యానికి డబ్బులు పెట్టకుండా ప్రభుత్వ కళాశాలలో చేరీ, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. వారి వెంట కళాశాల సిబ్బంది నరేష్, సుజాత, గజానంద్, ఉన్నారు.

విద్యార్థినులకు సకాలంలో పాఠశాలకు పంపాలి...

విద్యార్థినులకు సకాలంలో పాఠశాలకు పంపాలని జిల్లా సార్మెడి దుర్గు పటేల్ అన్నారు. శుక్రవారం జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బడిబాటలో భాగంగా పోషకులకు విద్యపై అవగాహన కల్పించారు. ఈనెల 12 నుండి పాఠశాలలు ప్రారంభమౌతున్న సందర్భంగా విద్యార్థినులకు ఇంట్లో ఉంచకుండా తల్లిదండ్రులు సకాలంలో పాఠశాలకు పంపించాలని కోరారు. బడిబాట కార్యక్రమంలో ఉపాద్యాయ సిబ్బంది కైలాష్, విశ్వనాథ్, పుష్పలత, హరిచంద్, శివాజీ, గంగాధర్, చంపావతి, మల్కు, బాలాజీ, రాజు, రవీందర్, సుజాత, రాజ్యలక్ష్మి సునీత, గ్రామ పటేల్ యూత్ సభ్యులు ఉన్నారు.

హామీలు అడిగితే అరెస్టు చేస్తారా?



నవతెలంగాణ-జన్నారం

హామీలను అడిగితే అరెస్టు చేస్తారా? అని తెలంగాణ గల్ఫ్ వెల్ఫేర్ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సభ సందర్భంగా స్థానిక పోలీసులు ఇలా ముందస్తు అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2014 ఎన్నికలలో గల్ఫ్ కార్మికులకు 500 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడతామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదన్నారు. ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తీసుకుపోయినా ఫలితం రాలేదని పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కొరకు ఎన్ని అరెస్టులు చేసినా వెనకాడబోమని అన్నారు. రాబోయే ఎన్నికలలో గల్ఫ్ కార్మికులు వార్డ్ మెంబర్ నుండి ఎమ్మెల్యే, ఎంపీ వరకు పోటీ చేసి తమ సత్త చాటుతామన్నారు.

టిడిపి, బిజెపి, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు...

సమీకృత కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ వస్తున్న సందర్భంగా టిడిపి, బిజెపి, కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. టిడిపి ఆదిలాబాద్ పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రాజేశ్వర్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలను ఎండగడతామన్నారు. బిజెపి మండల అధ్యక్షుడు గోలి చందు, ఎంపీటీసీ కొంతం శంకరయ్య కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొర్లకుంట ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి పసివుల్లా, టిడిపి జిల్లా నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుల విజయకుమార్ అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధితో తెలంగాణ దేశానికే తలమానికం

- రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



నవతెలంగాణ-నస్పూర్,రామకృష్ణాపూర్

రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలు, అనేక సంస్కరణలతో అన్ని రంగాలలో జరుగుతున్న అభివృద్ధితో దేశంలోని అన్ని రాష్ట్రాల దృష్టిని ఆకర్షించిన తెలంగాణ రాష్ట్రం దేశానికే తలమానికంగా మారిందని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా నస్పూర్‌లో సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) భవనాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు డి. మధుసూదన్ నాయక్, బి.రాహుల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు నల్లాల భాగ్యలక్ష్మీ, కోవ లక్ష్మీ, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, సిర్పూర్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య, సక్కు, కోనప్ప, రేఖానాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. నూతన కలెక్టరేట్ భవనంలో నిర్వహించిన సర్వమత పూజలు, ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను ఛాంబర్లో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుండి వేయి658కోట్ల రూపాయల వ్యయంతో చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో దాదాపు లక్ష ఎకరాలకు నీరందించే చెన్నూర్ ఎత్తిపోతల పథకం, మందమర్రి మండలంలో సుమారు 500కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, మంచిర్యాల అంతర్గాం మధ్య గోదావరి నదిపై 164కోట్ల రూపాయలతో నిర్మించనున్న వంతెన, హాజీపూర్ మండలం గుడిపేటలో 205 కోట్ల రూపాయలతో నిర్మించనున్న వైద్య కళాశాల భవనం పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నూతన కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ జిల్లాల విభజనతో మంచిర్యాల జిల్లాను ఏర్పాటు చేసుకొని ఎంతో అభివృద్ధి సాధించామని, అనేక సంస్కరణలతో ప్రజా సంక్షేమంలో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ సమీకృత కలెక్టరేట్ భవనం ద్వారా ఒకే చోట అందిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా రైతుల సౌకర్యార్థం 2వేల601 క్లస్టర్లను ఏర్పాటు చేసి విస్తరణాధికారులను నియమించడం ద్వారా వ్యవసాయ రంగంలో సత్ఫలితాలు సాధిస్తున్నామని, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధిలో భాగంగా నాయిబ్రాహ్మణులకు మాడ్రన్ సెలూన్, రజకులకు మోడ్రన్ ఇస్త్రీ షాపుల ఏర్పాటు కొరకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకాన్ని మంచిర్యాల వేదికగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. గొల్ల, కుర్మల అభివృద్ధి కొరకు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ క్రమంలో 2వ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని మంచిర్యాల నుండి ప్రారంభిస్తున్నామని, రాష్ట్రంలో 3లక్షల80వేల మంది లబ్దిదారులకు 6వేల కోట్ల రూపాయల వ్యయంతో గొర్రెలు పంపిణీ చేసేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అనంతరం వెనుకబడిన తరగతుల కులవృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకం కింద అర్హులైన లబ్దిదారులకు, 2వ విడత గొర్రెల పంపిణీ లబ్దిదారులకు చెక్కులతో పాటు ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు.

గొర్రెలిప్పిస్తామని తిప్పారు..

- ఆంధ్రా అంతటా తింపి మొండి చేయి చూపించారు
- దశాబ్ది వేడుకల్లో యాదవుల ఆవేదన



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ప్రభుత్వం రెండో విడుత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగానే సుర్జాపూర్ గ్రామానికి చెందిన పలువురు యాదవులకు 18 యూనిట్లు మంజూరు అయ్యాయి. గొర్రెల కోసం ఆంధ్రా అంతటా తిప్పి చివరకు మొండి చేయి చూపించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రేఖానాయక్ ఎదుటనే యాదవులు తమ నిరసనను వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ఒక్కోయూనిట్ కు రూ.43,750 తమ వాటాగా మొత్తం రూ.7లక్షల87వేల 500 చెల్లించారు. మంజూరు లభించిన 18 మంది యాదవులు కానుగంటి మల్లేశ్ యాదవ్, అంగ రాజన్న యాదవ్, తోకల నారాయణ యాదవ్, రాంపూర్ ఆశన్న యాదవ్, మల్లయ్య యాదవ్, రమేష్ యాదవ్ మరికొందరు కలిసి గొర్రెలకోసం వెటర్నరీ అధికారుల సూచన మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు వెళ్లి గొర్రెలను తెచ్చుకోవాలని చెప్పి పంపించారు. పదిమంది కలిసి రెండు వాహనాల్లో వారం కింద గుంటూరుకు వెళ్లారు. అధికారులు సూచించిన అడ్రస్‌కు బయలుదేరగా అక్కడ ఉన్న దళారి రావల్సింది ఇక్కడికి కాదని కడపకు వెళ్లాలని సూచించాడు. కడపకు వెళ్లే క్రమంలో మార్గ మధ్యంలోని నెల్లూరు వద్దకు చేరుకోగానే, ఇక్కడ కాదు నాగార్జున సాగర్ వెళ్లాలని ఓదాళారి ఫోన్ ద్వారా చెప్పడంతో తిరిగి అక్కడినుంచి నాగార్జున సాగర్ వెళ్లగా ఇక్కడకాదు మాచర్లలో గొర్రెలు ఇస్తామని చెప్పి మూడు రోజులు ఆంధ్రా అంతటా తింపారని బాధితులు పేర్కొన్నారు. చివరికి మాచర్లలో అనారోగ్యంతో ఉన్న గొర్రెలను చూపించారని వివరించారు. వాటిని తెచ్చుకొని నష్టపోవడం ఇష్టం లేక తిరిగి వచ్చామని తమ గోడును వెళ్లబోసుకున్నారు. వాహనాల అద్దె, తిండి ఖర్చులు కలుపుకొని ఒక్కొక్కరికి రూ.6వేల 700 నష్టపోయామని వివరించారు. తమకు గొర్రెలు వద్దని, తాము వాటాగా చెల్లించిన డబ్బులు ఇస్తే చాలని అన్నారు. యూనిట్లు మంజూరైన వారు దిగులు చెందొద్దని, పరిశీలించి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే రేఖానాయక్ తెలిపారు.

లబ్ధిదారుల ఎంపిక వరకే మాబాధ్యత



సుర్జాపూర్‌లో 18 యానిట్లను ఎంపిక చేశాం. గొర్రెల కోసం గోసం గుంటూరు వెళ్లాలని చెప్పాము. లబ్ధిదారుల వెంట ఉండి బాధ్యత తీసుకోవాల్సిన సదరు ఇన్‌చార్జీ అధికారి వీరి వెంట లేరని చెప్తున్నారు.

వెటర్నరీ డాక్టర్ దీప్తి



అధికారులపై చర్యలు తీసుకోవాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-ఉట్నూర్

వంట చేసేందుకు కట్టెల కోసం వెళ్లిన గిరిజనుడిని కొట్టిన ఫారెస్ట్ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు డిమాండ్ చేశారు. మండలంలోని మొర్రిపేట్ గ్రామం రెండు రోజుల కింద సిడం పగ్గు కట్టేల కోసం అడవిలో వెళ్తే అటవీ శాఖ అధికారులు అతని పట్టుకొని బిర్సాయిపేట్ అటవీశాఖ కార్యాలయంలో తీసుకెళ్లి కొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి, యోగ క్షేమాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబమైన సిడాం పగ్గును అకారణంగా కొట్టడమే కాకుండా రూ.35వేల చెల్లించాలని డిమాండ్ చేయడం దారుణమని అన్నారు. అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాలను ఆదివాసీ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎవరైనా తప్పు చేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప కొట్టే అధికారం ఎవరిచ్చారని మండిపడ్డారు. రోజు రోజుకి అటవీ శాఖ అధికారుల ఆగడాలు పెరిగిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా బావులు మంజూరు అయితే అధికారులు వెళ్లి పూజ చేసుకొని బావులకు త్రీఫేస్ కరెంట్ లైన్ రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తునికాకు వెళ్లిన, కట్టెల కోసం వెళ్లిన, వేరే ఇతర పని కోసం వెళ్లిన, ఆదివాసులపై దాడులు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే మంచిది కాదని హెచ్చరించారు. గిరిజనుడిపై దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే జరగబోయే పరిమాణాలకు అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఆయన వెంట సర్పంచ్ తొడసం భగవంత్‌రావు, ఉపసర్పంచ్ సిడాం గంగాధర్, పార్టీ నాయకులు లాజర్, దేవానంద్, తెలంగ్ రావ్, అక్రు ఉన్నారు.



పెంపుడు జంతువులను హింసిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

పెంపుడు జంతువులను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని నిర్మల్ జిల్లా డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. ఇటీవల మండలంలో జింక మాంసమని చెప్పి పెంపుడు కుక్క మాంసం అమ్మిన ఘటనకు సంబంధించి శుక్రవారం మండలకేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రాకారం.. మండలంలోని పొట్టపెల్లి (కె) గ్రామానికి చెందిన శ్రీనివాస్ 26 సంవత్సరాలు, చామన్‌పల్లి గ్రామానికి చెందిన వరుణ్ అనే ఇద్దరు వ్యక్తులు మద్యానికి బానిస అయి, త్వరగా డబ్బు సంపాదించాలని కోరికతో పెంపుడు కుక్కలను పట్టి చంపి జింక మాంసం పేరుతో తెలిసిన వారికి విక్రయించారని తెలిపారు. ఇలా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ ఉండేవారు. గత నెల 30న మండలకేంద్రానికి చెందిన ఎంజలి ఆనంద్ తన పెంపుడు కుక్క కనపడట్లేదని వాకబు చేయగా, పొట్టపెల్లి(కె) గ్రామానికి చెందిన శ్రీనివాస్ కుక్కను తీసుకెళ్లినట్లు తెలిసి విచారించగా విషయం బయటపడటంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో నిందితులను విచారించగా పెంపుడు కుక్కను చంపి, జింక మాంసమని పలువురికి విక్రయించినట్లు నిందితులు ఒప్పుకున్నారు. నిందితుల నుండి కుక్కను చంపడానికి ఉపయోగించిన ఒక కత్తి, మూడు వేల రూపాయలు నగదు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పెంపుడు జంతువులు, వన్యప్రాణులను హింసించడం నేరం అని, కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. వన్య ప్రాణులను హింసించి మాంసం విక్రయించడం, కొనడం నేరం అని ప్రజలు విషయం తెలిసిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. త్వరితగతిన కేసుని చేదించిన ఏ స్సై రాహుల్ గైక్వాడ్,పోలీస్ సిబ్బంది సునీల్, వనిత,అశోక్, గణేష్‌లను డీఎస్పీ అభినందించారు.

రూ.10 కోట్లతో రెంకోని వాగుపై వంతెన నిర్మాణం

- పనులు ప్రారంభించిన మంత్రి ఐకే రెడ్డి



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలోని దిలావర్‌పూర్ గ్రామ సమీపంలోని రెంకోనివాగు రోడ్ డ్యాం వద్ద, గాంధీనగర్ ప్రాంతంలోని రోడ్ డ్యామ్ వద్ద రూ : 5.30 కోట్లతో నిర్మించనున్న వంతెన నిర్మాణ పనులకు శుక్రవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రేఖాశ్యామ్ నాయక్ భూమిపూజ చేశారు. అదేవిధంగా ఖానాపూర్ నుంచి తర్లాపాడ్ వెళ్లే దారిలో ఉన్న గాంధీనగర్ వద్ద రోడ్ డ్యాం వద్ద నిర్మాణానికి రూ.4.70 కోట్లు ప్రభుత్వం మంజూరీ చేసిందని తెలిపారు. ఈ రెండు వంతెనల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఈ వంతెనలు పూర్తయితే వర్షాకాలంలో ప్రయాణికులకు రాకపోకల సమస్యలు తీరుతాయని అన్నారు.

బస్తీ దవాఖాన సేవలు వినియోగించుకోవాలి...

పేద ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్తీదవాఖాన సేవలు వినియోగించుకోవాలని మంత్రి ఐకేరెడ్డి సూచించారు. ఖానాపూర్ పర్యటన సందర్భంగా పట్టణంలోని సుభాష్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ అర్బన్ హెల్త్ వెల్ సెంటర్‌ను ఆయన ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి ప్రారంభించారు. రూ.13 లక్షలతో నిర్మించిన ఈ దవాఖానాలో డాక్టర్, కంఫౌండర్‌తో పాటు రక్తనమూన వైద్యులు సేవలంధిస్తారని తెలిపారు. సాదారణ జ్వరాలకు దూరప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బంధి పడే పేద ప్రజలకు ఈ దవాఖానాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయనంత అభివృద్ధి సీఎం కేసీఆర్ చేస్తున్నారని, ప్రజలు మరోసారి ఆధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్, ఎంపీపీ మోయిద్, నాయకులు రాజగంగన్న, వెంకాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటప్పయ్య, గుగ్గిళ్ల రాజేందర్ గౌడ్, అమంద శ్రీనివాస్, ద్యావతి రాజేశ్వర్, కే.సంతోష్ తహసీల్దార్ రాజమోహన్, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ సర్కార్‌ను సాగనంపాలి



నవతెలంగాణ-భైంసా

మాయ మాటలతో కాలం వెళ్లదీస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలు సాగనంపే సమయం వచ్చిందని బీజేపీ నియోజకవర్గ నాయకులు పవార్ రామారావు పటేల్ అన్నారు. మహా జన సంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భైంసా మండలంలోని చుచుంద్, పాంగ్రి, మంగ్రి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ గ్రామాన ఆయన బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా పేరు మార్చి కాలం గడుపుతున్నారే తప్ప చేసిందేమీ లేదని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కేంద్ర నిధులతోనే కొనసాగుతుందని అన్నారు. ముధోల్ నియోజకవర్గంలో ఏం సాధించారని చెరువుల పండుగ చేసుకుంటున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి సమస్యల పరిష్కరించడంలో విఫమయ్యారని అన్నారు. గుండెగావ్ సమస్య సంవత్సరాల తరబడి పరిష్కారం కావడం లేదంటే ఎమ్మెల్యే చేతగానితనమే అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క చెరువైన నిర్మించారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హాయంలోనే ప్రాజెక్టులు చెరువులు నిర్మించబడ్డాయని అన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు. దళితబంధు ఏమైందని ప్రశ్నించారు. రైతాంగానికి రుణమాఫీ చేస్తామన్న కేసీఆర్ నాలుగు సంవత్సరాలు దాటిన చేయకపోవడం ఏంటన్నారు. ఎన్నికలు సమీపించగానే ఉచిత హామీలు ఇవ్వడం కేసీఆర్‌కు అలవాటైందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ బి.గంగాధర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఎంపీటీసీ రజాక్, మాజీ సర్పంచ్ సిద్దిరాం, ఇలేగాం సర్పంచ్ గంగిశెట్టి ముత్యం, నాయకులు హన్మండ్లు, బాలాజీ పటేల్, బీజేపీ మండల అధ్యక్షులు భూమేష్ పాల్గొన్నారు.

పసికందు మృతదేహం లభ్యం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం పసికందు మృతదేహం లభ్యమైంది. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పసికందు మృతదేహం ఉందని సమాచారం మేరకు స్థానికుల తెలిపిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేసి త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-బేల

మండలంలోని సాంగిడి ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం సదల్‌పూర్ ఆలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మహదేవ్, బైరందేవ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 26ఏండ్ల తర్వాత అందరూ ఒకచోట చేరి తమ చిన్ననాటి మధురానుభూతులను పంచుకున్నారు. భవిష్యత్తులో తోటి మిత్రులకు ఏ అవసరమైన అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.